సాక్షి
పార్వతీపురం మన్యం
ఆదివారం । 14 । జనవరి । 2024



రోగి ఇంటికే మందులు

ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. ఉచితంగా ఇంటివద్దకే మందులు చేర్చుతోంది. -IIలో



భోగి పండగకు ఆ గ్రామాలు దూరం -IIలో

ఆ గ్రామాల్లో భోగి మంటలు వేయరు. పూర్వం నుంచి వస్తున్న పండగ ఆచారాన్ని గ్రామస్తులు పాటిస్తున్నారు.

నేడు మంత్రి బొత్స జిల్లాకు రాక

విజయనగరం అర్బన్: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆదివారం జిల్లాకు చేరుకుంటారు. ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు నగరంలోని తన నివాసంలో ఉంటారు. సంక్రాంతి వేడుకల్లో పాల్గొననున్నారు.

న్యూస్‌రీల్

సంక్రాంతి శుభాకాంక్షలు



పీడిక రాజన్నదొర

సాలూరు: హిందువులు పెద్దపండగగా పిలుచుకునే భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ పండగలను ప్రజలందరూ కుటుంబాలతో కలిసి సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర కోరారు. జిల్లా ప్రజలందరికీ శనివారం సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

అన్ని రంగాల్లో నగరాన్ని అభివృద్ధి చేశా..



కుళాయిలను ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నియోజకవర్గ ప్రజలు తనపై నమ్మకం ఉంచి గెలిపించడం ద్వారా కార్పొరేషన్ హోదా దక్కించుకున్న నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపించామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ప్రత్యేక దృష్టి సారించి వారి సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు. మరోసారి అవకాశం ఇస్తే యవతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు తనకు చివరవని విజయనగరం నియోజకవర్గ ప్రజలు మరోసారి తనను ఆశీర్వదించాలని కోరారు. నగరంలోని 30, 31 డివిజన్లకు సంబంధించి పద్మావతినగర్ సమీపంలోని వసంత విహార్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పబ్లిక్ కుళాయిలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కోలగట్లకు అపార్ట్‌మెంట్ వాసులు ఘనస్వాగతం పలికారు. అనంతరం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ, వసంతవిహార్ ఏర్పాటై దాదాపు 15 ఏళ్లు కావొస్తున్నా, ఈ ప్రాంతంలో కనీస అవసరాలు ఏర్పాటు కాలేదన్నారు. తాను శాసనసభ్యుడిగా ఎన్నికైన తర్వాత ప్రజలకు అవసరమైన సదుపాయాలన్నీ కల్పిస్తున్నట్లు చెప్పారు. కొత్త ధర్మపురిలో వాటర్‌ట్యాంక్ ఏర్పాటు చేసి అక్కడ నుంచి ప్రత్యేక పైపులైన్ల ద్వారా కుళాయిలు ఏర్పాటు చేశామన్నారు. మరోసారి శాసనసభ్యుడిగా ఎన్నికైతే సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల కృష్ణారావు, మారం బాలబ్రహ్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్లు ఎన్ని లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

పొట్టేళ్లకు గిరాకీ



దత్తిరాజేరు మండలం పెదమానాపురంలో కిటకిటలాడుతున్న పొట్టేళ్ల సంత

దత్తిరాజేరు: సంక్రాంతి పండగ నేపథ్యంలో పెదమానాపురం వారపు సంత వ్యాపారులు, కొనుగోలుదారులతో శనివారం కిటకిటలాడింది. సంతకు వచ్చిన వారు కుండలు, దుస్తులు, పూజా సామగ్రిని పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. పొట్టేళ్లు, కోళ్లకు గిరాకీ పలికింది. క్రయవిక్రయాలు జోరుగా సాగాయి. రూ.కోట్లలో వ్యాపారం సాగింది.

పల్లె గూటికి పండగొచ్చింది



- బీదిబీదినా భోగి పండగ సందడి
- సంక్రాంతికి పల్లెలకు చేరుకుంటున్న దూరప్రాంత నివాసితులు
- రైళ్లు, బస్సులు కిటకిట
- అతిథులకు స్వాగతిమిస్తున్న గ్రామీణ ప్రాంతాలు
- నేటి నుంచి పెద్దపండగ ఆరంభం



ప్రభుత్వ కార్యాలయాల సముదాయం (ఆర్‌సీఎం పాఠశాల) ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలు

పార్వతీపురంటౌన్:

హరిలోరంగ హరి... సమస్తం చల్లగా ఉండాలని దీవించే హరిదాసుల కీర్తనలు.. అయ్యగారికి వందనం అమ్మగారికి చందనమంటూ డూడూ బసవన్న దీవెనలు.. వేకువజామున జంగమదేవరలు మోగించే గంటలు.. బుడబుక్కలి వాయించే ఢమరుక నాదాలు.. బడాయి పోతూ నాకేం తక్కువంటూనే మామూళ్లడిగే పిట్టలదొరలు.. చమత్కారాలతో చిందులేస్తూ ఎంతోకొంత సమర్పించుకుంటే గానీ కదలని కొమ్మదాసరులు.. ఇలా చెప్పుకొంటూపోతే పెద్దపండగది పెద్ద జాబితాయే. పల్లెవాసులు పెద్ద పండుగగా పిలుచుకునే సంక్రాంతి రాకతో ప్రతిఇంటా సంతోషం వెల్లివిరిస్తోంది. ప్రతి ఊరు సందడిగా కనిపిస్తోంది. ఆదివారం భోగి పండగతో ఆరంభమయ్యే సంక్రాంతి ఈ నెల 16వ తేదీ కనుమపండగతో ముగియనుంది. దేశవిదేశాల్లో ఉన్నవారు, ఉపాధి, ఉద్యోగాల కోసం వివిధ ప్రాంతాలకు వలస వెళ్లిన పల్లెజనం రాకతో రైల్వే, బస్‌స్టేషన్లు రద్దీగా మారాయి.

ప్రతి ఇంటా ప్రత్యేక వంట

సంక్రాంతి పండగకు ప్రతీఇంట పిండివంటకాలు నోరూరిస్తాయి. అరిసెలు, పాకుండలు, సున్నుండలు, జంతికలు, కారంబూందీ, కారపూస, బొబ్బట్లు వంటి వంటకాలు సంక్రాంతికి ప్రత్యేకమైనవి. అరిసెల్లో నువ్వులు వేసి చేస్తే మరో ప్రత్యేకం. స్వచ్ఛమైన నేతితో, అచ్చమైన బెల్లంతో చేసే సున్నుండలు మరి ప్రముఖమైనవి. భోగిరోజున భోగిమంటలో కాల్చిన వంకాయలతో చేసిన పచ్చడి, మకర సంక్రాంతి నాడు పులిహోర, గారెలు, పాయసం, కనుమకు గ్రామదేవతలకు సమర్పించే నైవేద్యాల్లో మాంసాహారం ఉంటుంది. ఇష్టాలనుబట్టి తయారుచేసుకునే దద్దోజనం, పొంగలి వంటివి అతిథులకు ప్రత్యేక వంటకాలుగా చెప్పవచ్చు.

సందడిగా సంక్రాంతి

పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్, డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు, మలేరియా నివారణ అధికారి జగన్మోహనరావు, పలు శాఖల ఉద్యోగులు భోగి మంట వెలిగించారు. ప్రజలంతా సిరి సంపదలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

సంక్రాంతి సంగతులెన్నో..

- పిల్లలకు ఇష్టమైన బొమ్మల కొలువు సంక్రాంతి ప్రత్యేకత. సంప్రదాయ దుస్తుల్లో చిన్నారులు బొమ్మల కొలువు వద్ద చేసే సందడి అంతాఇంతా కాదు.
- సంక్రాంతి సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీల వంటివి పల్లెల్లో ప్రత్యేకంగా నిలుస్తాయి.
- కొన్నిచోట్ల కళాకారులను సత్కరిస్తారు.
- చిన్ననాటి బాల్య స్నేహితులంతా స్వగ్రామాలకు వస్తుంటారు. అంతా ఒకచోట చేరి పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకునే సదావకాశం సంక్రాంతి ఇస్తుంది.
- కుటుంబంలో తరతరాలుగా ఉన్నవారంతా ఒకచోట చేరి కుటుంబాల పండగ నిర్వహించుకున్న సందర్భాలు సంక్రాంతిలో ఉంటున్నాయి.
- పూర్వ విద్యార్థులందరూ ఒక వేదికపైకి చేరుతున్నారు. ఆ'పూర్వ' కలయిక అవకాశాన్ని సంక్రాంతి కల్పిస్తోంది.

భలే వ్యాపారం

- ఒక్కరోజులోనే రూ.6 కోట్లమేర సాగిన వస్త్ర వ్యాపారం



చీరలు కొనుగోలు చేస్తున్న మహిళలు

ఉమ్మడి విజయనగరం జిల్లాలో సంక్రాంతి సందడి నెలకొంది. ఈ నెల 14 నుంచి నుంచి మూడు రోజుల పాటు జరుపుకునే సంక్రాంతి పండగ నేపథ్యంలో విజయనగరం, పార్వతీపురం పట్టణాలు జనజాతరను తలపించాయి. వివిధ ప్రాంతాలకు చెందిన వినయోగదారులు హెచ్చుసంఖ్యలో రావడంతో కిటకిటలాడాయి. ప్రధానంగా వస్త్ర వ్యాపారంతో పాటు పండగ నేపథ్యంలో పిండి వంటకాలకు అవసరమైన సరుకులు కొనుగోలు చేసేందుకు వినియోగదారులు పెద్దసంఖ్యలో బారులు తీరుతూ కనిపించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో వస్త్ర వ్యాపారానికి తలమానికంగా నిలిచే విజయనగరంలో శుక్రవారం ఒక్కరోజు రూ.5 కోట్లకు పైగా వ్యాపారం జరగగా, పార్వతీపురంలో రూ.కోటిమేర వ్యాపారం సాగినట్టు మార్కెట్ వర్గాల అంచనా. అలాగే, పండగలో వండుకునే పిండివంటకాల కోసం అవసరమైన నిత్యావసరాల కొనుగోళ్లు మరో రూ.3.50 కోట్ల వరకు సాగాయి.





ప్రయాణికులతో కిక్కిరిసిన పార్వతీపురం బస్టాండ్



బిజీ బిజీగా రైల్వేస్టేషన్



పార్వతీపురం పట్టణంలో కూరగాయలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

రాష్ట్రంలో 1,43,600 మందికి టిడ్కో ఇళ్లు

- ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

పార్వతీపురంటౌన్: రాష్ట్రంలో 1,43,600 మంది పట్టణ ప్రజలకు టిడ్కో ఇళ్లు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ తెలిపారు. పార్వతీపురం పట్టణంలో ఆయన విలేకరులతో శనివారం మాట్లాడారు. గతంలో చేసిన ప్రజా సంకల్పయాత్రలో పేదలకు ఇచ్చిన మాటను నెరవేర్చాలనే సదుద్దేశంతో ఈ బృహత్తర కార్యక్రమం చేపట్టారన్నారు. ఒక్క రూపాయికే ఇళ్లు ఇస్తానని అప్పట్లో ఇచ్చిన మాటకు రిజిస్ట్రేషన్‌తో కలిపి ఒక్కోగృహానికి రూ.12లక్షలు ఖర్చుచేసి పేదలకు అందజేస్తున్నారన్నారు. ఇప్పటి వరకు 35 పట్టణాల్లో 95వేల గృహాలను పేదలకు అందజేసినట్టు వెల్లడించారు. విజయనగరం నగరపాలక సంస్థకు సంబంధించి సారిపల్లిలో 1500 గృహాలను అందజేశామన్నారు. సాలూరులో నిర్మాణం పూర్తయిన 1000 గృహాలను ఈనెల చివరిలో లబ్ధిదారులకు అప్పగిస్తామని తెలిపారు. పార్వతీపురంలో నిర్మాణ దశలో ఉన్న 760 గృహాలను ఫిబ్రవరి నెల చివరలో అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. పార్వతీపురం పట్టణంలో నిర్మిస్తున్న టిడ్కో గృహాల వద్ద 30 లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ప్లాంట్‌ను నిర్మించి అక్కడ వినియోగం చేయగా మిగిలిన నీటిని పార్వతీపురం మున్సిపాలిటీకి అందించేలా చర్యలు చేపట్టామన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలి

భారత దేశంలోనే అతిపెద్ద డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని ఈ నెల 19వ తేదీన విజయవాడలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరిస్తారని జమ్మాన తెలిపారు. సుమారు రూ.300 కోట్ల వ్యయంతో విగ్రహం నిర్మించినట్టు వెల్లడించారు. విగ్రహావిష్కరణలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చు



రక్తదానం చేస్తున్న దాతలు

విజయనగరం ఫోర్ట్: రక్తదానంతో ఎదుటవారి ప్రాణాలు కాపాడవచ్చని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ ప్రసాదరావు అన్నారు. స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో జన్ భాగీదరి కార్యక్రమంలో భాగంగా శనివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆపదలో ఉన్న సాటి మనిషికి రక్తం ఇచ్చి ప్రాణం కాపాడే అవకాశం మనుషులకే ఉందన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్యదర్శి సత్యం, గౌరీశంకర్, రాము, తదితరులు పాల్గొన్నారు.

దళితుల సంక్షేమానికి సీఎం కృషి

విజయనగరం ఫోర్ట్: దళితుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రెల్లికుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు సోము మురళీమోహన్ అన్నారు. ప్రభుత్వం ఈ నెల 19వ తేదీ నుంచి కులగణన చేపడుతున్న నేపథ్యంలో ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ లంకాపట్నంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు అయినా ఇంతవరకు కులగుణన జరగలేదని చెప్పారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి కులగుణన చేపట్టడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో దుర్గారావు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

పణుకువలసలో పీఎం జన్‌మాన్



మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్ కుమార్

పాచిపెంట: పీఎం జన్‌మాన్ (ప్రధాన మంత్రి జన్ జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్) శతశాతం నమోదే లక్ష్యమని కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. పణుకువలస గ్రామంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పీవీటీజీలు అభివృద్ధికి దూరంగా ఉన్నారని కేంద్ర ప్రభుత్వం పీఎం జన్‌మాన్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ప్రతి ఆదివాసీకి వివిధ పథకాలతో సాయం అందిస్తోందన్నారు. ప్రతిఒక్కరూ ఉజ్వల యోజన పథకం కింద నమోదు కావాలని, దీనివల్ల ఉచితంగా గ్యాస్ కనెక్షన్ లభిస్తుందన్నారు. ఏడాదికి 12 సిలిండర్లపై 30 శాతం రాయితీ వర్తిస్తుందని తెలిపారు. దేశంలో 8 కోట్ల మంది ప్రయోజనం పొందుతున్నట్టు చెప్పారు. జీవన్ జ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన పథకాలతో ప్రమాద బీమా లభిస్తుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోవిందరావు, ఆర్డీఓ కె.హేమలత, ఎంపీపీ బద్నాన ప్రమీల, వైస్ ఎంపీపీ ఎం.నారాయణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.జగన్నాథరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి డా.ఎం.వి.ఆర్.కష్టాజీ, జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి కె.శ్రీనివాసరావు, గ్రామ, వార్డు సచివాలయాల సమన్వయ అధికారి వి.చిట్టిబాబు, జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్.శివప్రసాద్, గిరిజన సహకార సంస్థ డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్ పాల్గొన్నారు.

ఇండియన్ హెర్క్యులస్.. కోడి రామ్మూర్తినాయుడు

- కళియుగ భీముడి స్వస్థలం వీరఘట్టం
- మల్లవిద్యతో ప్రపంచ దేశాల్లో భారతదేశ ఖ్యాతిని చాటిచెప్పిన సార్వభౌముడు
- నేడు కోడి రామూర్తినాయుడు వర్ధంతి



కోడి రామ్మూర్తి నాయుడు చిత్రపటం

వీరఘట్టం: ఇండియన్ హెర్క్యులస్...కళియుగభీముడు... మల్లమార్తాండగా ప్రపంచ దేశాల్లో భారతదేశ కీర్తి ప్రతిష్ఠలను చాటిచెప్పిన బాహుబలి కోడి రామ్మూర్తినాయుడు. ప్రస్తుత పార్వతీపురం మన్యం జిల్లాలోని వీరఘట్టం ఆయన స్వస్థలం. తెలగవీధికి చెందిన కోడి వెంకన్న నాయుడు, అప్పలకొండ దంపతులకు 1883 నవంబర్ 3న రామ్మూర్తినాయుడు జన్మించాడు. ప్రస్తుత సినిమాల్లో డూప్‌గా తీసే ఒంటి చేత్తో కారును ఆపడం... రెండు తాళ్లు కట్టి కారులను లాగడం... బండరాళ్లను ఛాతిపై పెట్టి సమ్మెటలతో కొట్టించుకోవడం వంటి ప్రదర్శనలను రామ్మూర్తినాయుడు తన నిజజీవితంలో ఎన్నో చేశారు. అంతేకాక తన సర్కస్ కంపెనీ ద్వారా జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ఎన్నో ప్రదర్శనలు ఇచ్చి ఇండియన్ హెర్క్యులస్‌గా పేరుగాంచారు. అటువంటి మహానుభావుడి మనోడే అన్ని చెప్పుకునేందుకు మన్యం ప్రజలు గరిస్తున్నారు. 1942 జనవరి 14వ తేదీన ఆయన స్వర్గస్తులయ్యారు. ఆయన వర్ధంతిని జిల్లాలో ఆదివారం జరుపుకునేందుకు అభిమానులు ఏర్పాట్లు చేస్తున్నారు.

క్లుప్తంగా

2 లక్షల టన్నుల చెరకు క్రషింగ్ పూర్తి



క్రషింగ్‌కు చెరకును తరలిస్తున్న రైతులు

రేగిడి : మండలంలోని సంకిలి వద్ద ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో ఇప్పటి వరకూ 2 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ పూర్తయిందని అసోసియేటివ్ వైస్ ప్రెసిడెంట్ పట్టాభిరామిరెడ్డి విలేకరులకు శనివారం తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం జిల్లాల నుంచి చెరకును తెచ్చి క్రషింగ్ చేస్తున్నామని వివరించారు. ప్రతీ రోజు 3700 టన్నులు చెరకు క్రషింగ్ అవుతుందని చెప్పారు. గతేడాది అక్టోబర్ చివరి వారంలో క్రషింగ్ ప్రారంభించామని, ఈ ఏడాది ఏప్రిల్ వరకు క్రషింగ్ చేస్తామని వెల్లడించారు. 4.10 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు లక్ష్యంగా చేసుకున్నామని వివరించారు. రైతులకు సకాలంలో చెరకు బిల్లులు చెల్లిస్తున్నామని వెల్లడించారు. ఇదిలా ఉండగా మండలంలో పలు గ్రామాల్లో రైతులు చెరకు పంట కోత పనుల్లో బిజీగా ఉన్నారు. చెరకును నరికి ట్రాక్టర్ల ద్వారా కర్మాగారానికి తరలిస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం



పురుషోత్తంనాయుడు

బలిజిపేట: పెదపెంకి గ్రామానికి చెందిన 30సంవత్సరాల పి.పురుషోత్తంనాయుడు ఈ నెల 11వ తేదీ నుంచి కనిపించడం లేదని ఆయన తమ్ముడు రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ పాపారావు శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. పురుషోత్తంనాయుడు ఈ నెల 10వ తేదీ రాత్రి ఇంటివద్ద పడుకున్నాడు. మర్నాడు ఉదయం నుంచి కనిపించకపోవడంతో ఆందోళన చెందుతున్నామని రాంబాబు ఫిర్యాదులో పేర్కొన్నారు. దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన దుర్గాప్రసాద్

కొత్తవలస : మండలంలోని కొత్తవలస – పెందుర్తి రైల్వేలైన్‌లో మంగళపాలెం గ్రామ సమీపంలో గుర్తు తెలియని రైలు కింద పడి విశాఖపట్నం జిల్లా తాటిచెట్లుపాలెం సమీపం సంజీవయ్య కాలనీకి చెందిన పిట్టా దుర్గాప్రసాద్ (47) శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు కొద్ది కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నట్టు తెలిసింది. కాగా మంగళపాలెం గ్రామంలో తెలిసిన వారి ఇంటికి వచ్చి తిరుగు ప్రయాణంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్టు స్థానికులు తెలిపారు. జీఆర్‌పీ ఎస్‌ఐ శ్రీనివాసరావు, ఆర్‌పీఎస్ ఎస్‌ఐ ఏడీరావు ఘటనా స్థలానికి చేరుకొని మృతుడు వివరాలను సేకరించి మృతదేహాన్ని విశాఖపట్నం కేజీహెచ్‌కి తరలించారు.

పాముకాటుతో మహిళ మృతి

మెరకముడిదాం: మండలంలోని యాడిక గ్రామానికి చెందిన సావుబాలమ్మ (33) శుక్రవారం పాముకాటుకి గురై శనివారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళ్తే... బాలమ్మ శుక్రవారం సాయంత్రం తన పొలంలో మొక్కజొన్న పంటను చూసేందుకు వెళ్లింది. మొక్కజొన్న పంటను పరిశీలిస్తుండగా పాము కాటుకు గురైంది. వెంటనే ఆమె ఇంటికి వెళ్లి తన భర్త శ్రీనుకు విషయాన్ని తెలియజేసింది. దానికి స్పందించిన ఆమె భర్త శ్రీను బంధువులు సహాయంతో చీపురుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సని అందించిన వైద్య సిబ్బంది మెరుగైన వైద్యాన్ని అందించేందుకు విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న బాల శనివారం సాయంత్రం మృతి చెందింది. బాల పాముకాటుకు గురై మృతి చెందిన విషయాన్ని ఆమె భర్త శ్రీను బుధరాయవలస పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బుధరాయవలస ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందాల రాయుళ్ల అరెస్టు

భోగాపురం: మండలంలోని లింగాలవలస గ్రామ శివారులో నిర్వహిస్తున్న కోడి పందాల శిబిరంపై పోలీసులు దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు సీఐ బీవీ వెంటేశ్వరరావు తెలిపారు. ఈ దాడిలో అరెస్టు చేసిన వారి నుంచి మూడు కోడి పుంజులు, రూ.1600 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు చెప్పారు. జిల్లా ఎస్పీ దీపిక ఆదేశాల మేరకు సంక్రాంతి పండగ సందర్భంగా మండలం వ్యాప్తంగా కోడి పందాలు నిర్వహించే వ్యక్తులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని సీఐ తెలిపారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹200

రోగి ఇంటికే మందులు

- వైద్యశిబిరాల్లో సిఫార్సు చేసిన వారికి అందజేత
- పోస్టల్ శాఖ ద్వారా సరఫరా

విజయనగరం ఫోర్ట్: మక్కువ మండలంలోని ఎ.వెంకంపేటకు చెందిన ఎన్.నరసయ్యకు బీపీ, సుగర్‌తో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నాయి. వెంకంపేటలో జరిగిన ఫ్యామిలీ డాక్టర్ వైద్యశిబిరం వద్దకు తనిఖీకి వెళ్లగా పరీక్షించిన వైద్యులు బీపీ, సుగర్, ఇతర ఆరోగ్య సమస్యలు నయం కావడానికి అవసరమైన మందులను యాప్‌లో అప్‌లోడ్ చేశారు. వాటిని సెంట్రల్ డ్రగ్ స్టోర్ సిబ్బంది డౌన్‌లోడ్ చేసి మందుల చీటీతో పాటు మందులను బాక్సులో ప్యాక్ చేసి రోగి ఇంటికి పోస్టల్‌లో పంపించారు.

గరుగుబిల్లి మండలం పెద్దూరుకు చెందిన బొత్స శ్రీరాములునాయుడు సుగర్ వ్యాధితో బాధపడుతున్నాడు. గ్రామంలో నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ డాక్టర్ వైద్యశిబిరంలో చూపించుకోగా వైద్యుడు కొన్ని రకాల మందులు అవసరమని యాప్‌లో అప్‌లోడ్ చేశారు. దీంతో సెంట్రల్ డ్రగ్ స్టోర్ సిబ్బంది ఆ రోగికి పోస్టల్ ద్వారా మందులు పంపించారు.

వీరిద్దరికే కాదు. క్రానిక్ వ్యాధులతో బాధపడే అనేక మందికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇంటికే మందులు అందిస్తోంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని సకాలంలో ఆస్పత్రికి చేర్చడం కోసం 108 అంబులెన్సులను ప్రవేశపెట్టింది. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా రోగులకు వైద్యసేవలు అందిస్తోంది. అంతేకాకుండా చికిత్సనంతార భృతిని కూడా అందజేస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాలకు వైద్యులు వెళ్లి సేవలు అందిస్తున్నారు. మంచంపై నుంచి లేవలేని స్థితిలో ఉన్న వారి ఇళ్లవద్దకు వెళ్లి సేవలు అందిస్తున్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల్లో మొదటి విడత లక్షలాది మందికి వైద్యసేవలు అందించడంతో పాటు రక్తపరీక్షలు నిర్వహించారు.



రోగులకు మందులు అందజేసేందుకు ప్యాకింగ్ చేస్తున్న సెంట్రల్ డ్రగ్ స్టోర్ సిబ్బంది

మందుల అందజేత గొప్ప కార్యక్రమం



క్రానిక్ డిసీజెస్ ఉన్న రోగులకు ప్రభుత్వం ఇళ్ల వద్దకు మందులు అందజేయడం గొప్ప కార్యక్రమం. ఎవరికి మందులు ఇళ్లకు అందజేయాలో వైద్యులు సూచిస్తే వారికి పోస్టల్ ద్వారా అందిస్తాం.

దాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ

130 మందికి మందుల సరఫరా

ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో వైద్యులు సిఫార్సు చేసిన 130 మంది రోగులకు సెంట్రల్ డ్రగ్‌స్టోర్ సిబ్బంది ఒక్కో రోగికి రూ.700 నుంచి రూ.3 వేల వరకు విలువ చేసే మందులను పంపించారు. క్రానిక్ డిసీజెస్ అయిన కేన్సర్, బీపీ, సుగర్, గుండెజబ్బులు ఉన్న వారు మందుల కోసం ఎంతో ఇబ్బంది పడేవారు. కానీ ప్రస్తుతం ప్రభుత్వమే రోగుల ఇళ్లకు మందులు పంపిస్తుండడంతో స్థిమిత పడుతున్నారు.



మందులు సరఫరా చేసే బాక్సు

సీతంను సందర్శించిన ఏప్ సొల్యూట్ వ్యవస్థాపకులు

విజయనగరం టౌన్: ఏప్ సొల్యూట్ సంస్థ వ్యవస్థాపకులైన మడస పాపారావు, కల్పలత సీతం ఇంజినీరింగ్ కళాశాలను శనివారం సందర్శించారు. గతంలో ఏర్పరచుకున్న ఒప్పందం మేరకు సీతంను సందర్శించామన్నారు. ఏప్ సొల్యూట్ ఎస్ఏపీకు సంబంధించిన విస్తృత సేవలందిస్తున్న బహుళ జాతీయ సంస్థ ఏప్ సొల్యూట్‌కు జర్మనీ, యూకే, ఫ్రాన్స్, స్పెయిన్, ఆస్ట్రియా, స్విట్జర్లాండ్, చైనా, దుబాయ్ దేశాల్లో వాణిజ్య సంస్థలున్నాయన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచనా సరళిలో నిర్దిష్టమైన మార్పు రావాలని, క్రమశిక్షణతో పాటూ నిబద్ధత ఉండాలన్నారు. ఐటీ రంగంలో ప్రస్తుతం కనబడుతున్న నిరుద్యోగ సమస్య నిజంగా చూస్తే కంపెనీలు ఆశించే పనితనానికి విద్యార్థుల సామర్థ్యానికి మధ్య పొంతన లేకపోవడమేనని పేర్కొన్నారు. భారతదేశంలో ఐటీ రంగంలో తరగని ఉద్యోగ అకాశాలున్నాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డీవీ.రామమూర్తి, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి డి.అవినాష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ఏప్ సొల్యూషన్ సంస్థ ప్రతినిధులను సత్కరిస్తున్న కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు, తదితరులు

రైస్‌మిల్లుపై క్రిమినల్ కేసు

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం టౌన్: రైతుల నుంచి అదనంగా ధాన్యం తీసుకుంటే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ నిషాంత్‌కుమార్ గతంలో హెచ్చరించినప్పటికీ అందుకు పాల్పడిన పాలకొండకు చెందిన సత్యనారాయణ మోడ్రన్ రైస్ మిల్లుపై క్రిమినల్ కేసు శనివారం నమోదు చేశారు. వివరాలు పరిశీలిస్తే జియ్యమ్మవలస మండలం అలమండ గ్రామానికి చెందిన డొల్లు సతీష్ తన ధాన్యాన్ని విక్రయించేందుకు పాలకొండకు చెందిన సత్యనారాయణ మోడ్రన్ రైస్‌మిల్లుకు తరలించారు. అయితే 62 కిలోల ధాన్యం అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందుకు సంబంధించిన మొత్తాన్ని మోడ్రన్ రైస్ మిల్లు యాజమాన్యం ఫోన్ పే ద్వారా చెల్లించాలని డిమాండ్ చేయడంతో సతీష్ తప్పనిసరి పరిస్థితిలో చెల్లించారు. తన వద్ద ధాన్యం డిమాండ్ చేయడం, ఫోన్‌పే ద్వారా డబ్బులు చెల్లింపుపై నేరుగా కలెక్టర్ నిషాంత్‌కుమార్‌కు సతీష్ శుక్రవారం ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ తక్షణమే స్పందించి క్రిమినల్ కేసు పెట్టాలని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎండీ నాయక్‌ను ఆదేశించగా పాలకొండ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. సతీష్‌కు ముందుగా అతను చెల్లించిన నగదును వెంటనే ఇప్పించారు. ఈ మేరకు కలెక్టర్ స్పందిస్తూ ఒక్క గింజ ధాన్యం అదనంగా తీసుకున్నా చర్యలు తప్పవని హెచ్చరించారు. హెచ్చరించిన తరువాత కూడా ప్రవర్తన మార్చుకోకపోతే చట్టరీత్యా చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. రైతులు ఒక్క గింజ ధాన్యం కూడా అదనంగా మిల్లర్లకు ఇవ్వరాదని ఆయన కోరారు. ధాన్యం కొనుగోలులో అవకతవకలపై 08963 29037, 77020 03582, 83338 13243 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఫైర్ ఇంజిన్ డ్రైవర్ ఆత్మహత్యా యత్నం

రాజాం సిటీ: స్థానిక ఫైర్ స్టేషన్‌లో ఫైర్ ఇంజిన్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న హోంగార్డు కేశవరావు ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఎప్పటిలాగే శుక్రవారం విధులకు హాజరైన ఆయన ఒక్కసారిగా కత్తితో గొంతు కోసుకున్నాడు. అందరూ ఉంటుండగానే ఈ ఘటన జరగడంతో అప్రమత్తమైన తోటి సిబ్బంది వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్సనందించారు. ఎటువంటి ప్రాణాపాయం లేదని వైద్యులు చెప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయంపై ఫైర్ ఎస్ఐ జనార్దనరావు వద్ద ప్రస్తావించగా ఎటువంటి సమస్యలు లేవని, ఎందుకిలా చేశాడో తెలియదని పేర్కొన్నారు.

జెడ్పీ సిబ్బందికి పదోన్నతి నియామక పత్రాలు అందజేత



ఉద్యోగికి పదోన్నతి నియామక పత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: జిల్లా పరిషత్ కార్యాలయంలో టైపిస్టులు, జూనియర్ సహాయకులుగా విధులు నిర్వహిస్తున్న ఏడుగురికి సీనియర్ సహాయకులుగా పదోన్నతి కల్పిస్తూ జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శనివారం నియమక పత్రాలు అందజేశారు. చైర్మన్ కార్యాలయంలో యూవీ సత్యనారాయణకు విజయనగరం పీఐయూలో, యంవి రమణకు పార్వతీపురం డ్వామా కార్యాలయంలో, జివిఎస్ఎస్.రవికుమార్‌కు గజపతినగరం పీఆర్‌ఐలో , ఎం.ఇందిరాకు పాచిపెంట మండల పరిషత్ కార్యాలయంలో, ఎల్.పైడిరాజు, కె.దశరథరామ్, జి శ్రీనివాసరావుకు పార్వతీపురం ఐటీడీఏలో సీనియర్ సహాయకులుగా నియమిస్తూ జడ్పీ చైర్మన్ తన కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు చేరిన బాలిక

విజయనగరం క్రైమ్: సంక్రాంతి పండగ పురస్కరించుకుని గంటస్తంభం, మార్కెట్ పరిసర ప్రాంతాలు ప్రజలతో కిటకిటలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆరేళ్ల తమటాపు దీక్షిత అనే బాలిక తల్లిదండ్రుల నుంచి తప్పిపోయి, ఏడుస్తూ ట్రాఫిక్ పోలీసులకు కనిపించింది. వెంటనే అక్కడ నుంచి వన్‌టౌన్ హెచ్‌సీ ఆవు వెంకటరమణకు సమాచారమందించారు. పోలీసులు పాప వద్ద నుంచి సమాచారం సేకరించారు. గంట్యాడ మండలం మురపాక గ్రామానికి చెందిన తమటాపు పైడినాయుడు కుటుంబ సభ్యులతో కలిసి పట్టణానికి వచ్చారు. షాపింగ్ చేసుకునే క్రమంలో వారి కుమార్తె దీక్షిత వారి నుంచి వేరై , తప్పిపోయినట్టు గుర్తించారు. వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు కుటుంబ సభ్యులను మైక్ ద్వారా అనౌన్స్ చేయించి, వారిని స్టేషన్‌కు పిలిపించి విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు సమక్షంలో దీక్షితను తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో పోలీసులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న వన్‌టౌన్ సీఐ వెంకటరావు

అంతర్జాతీయ సైన్స్ ఫెస్టివల్‌కు చీపురుపల్లి విద్యార్థులు

చీపురుపల్లి: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్(ఐఐఎస్ఎఫ్)కు చీపురుపల్లి విద్యార్థులు వెళ్లనున్నారు. కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ, కేంద్ర అణు శక్తి, కేంద్ర అంతరిక్ష పరిశోధనా శాఖ నేతృత్వంలో జనవరి 17 నుంచి 20 వరకు హర్యానా రాష్ట్రంలోని ఫరీదాబాద్‌లో గల ట్రాన్సులేషనల్ హెల్త్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్‌లో అంతర్జాతీయ స్థాయి సైన్స్ ఫెస్టివల్ జరగనుంది. ఈ సైన్స్ ఫెస్టివల్‌ను తిలకించి, సైన్స్‌పై అవగాహన పెంచుకునేందుకు ఆంధ్రప్రదేశ్ నుంచి 20 మంది విద్యార్థులను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. అందులో ఐదుగురు విద్యార్థులు చీపురుపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న ఎంఆర్.గాయత్రి దేవి, జేఏఎస్.శ్రీవిద్య, ఎస్.సుప్రియ, డి.పార్థసారధి, టివిఎం.సూరజ్‌లకు అవకాశం లభించింది.



గైడ్ కృష్ణారావుతో అంతర్జాతీయ సైన్స్ ఫెస్టివల్‌కు వెళ్లనున్న విద్యార్థులు

గైడ్‌గా అదే పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయునిగా పని చేస్తున్న మిరియాల కృష్ణారావును కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. అక్కడ జరగనున్న అంతర్జాతీయ సైన్స్ ఫెస్టివల్‌లో 17 విభాగాలకు చెందిన ప్రదర్శనలు ఉంటాయని గైడ్ కృష్ణారావు తెలిపారు. అంతర్జాతీయ సైన్స్ ఫెస్టివల్‌కు వెళ్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులను డీఈఓ లింగేశ్వర రెడ్డి, డిప్యూటీ ఈఓ వాసుదేవరావు, పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్ అభినందించారు.

సంధ్యారాణి వర్గీయుడిపై భంజ్‌దేవ్ కేసు

సాలూరు: తెలుగుదేశం పార్టీలో ఉన్న గ్రూపుల కొట్లాట ఇప్పుడు కేసుల వరకు వెళ్లింది. వివరాల్లోకి వెళ్తే.. గుమ్మడి సంధ్యారాణి, గొర్లె తిరుపతినాయుడు మద్దతుదారుడైన త్రిపురనేని విజయచౌదరిపై మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ భంజ్‌దేవ్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి పట్టణ సీఐ జీడీ బాబు తెలిపిన వివరాలు.. భంజ్‌దేవ్ వద్దకు ఈ నెల 1న నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు టీడీపీ సాలూరు టిక్కెట్ ఆశిస్తున్న తేజోవతి వచ్చారు. దీంతో తేజోవతికి తాను మద్దతు ఇస్తున్నానని అపోహ పడిన సంధ్యారాణి, జి.తిరుపతిరావుల మద్దతుదారుడైన త్రిపురనేని విజయచౌదరి తనను దుర్భాషలాడుతూ, బెదిరిస్తూ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశాడని భంజ్‌దేవ్ ఫిర్యాదు చేశారు. ఇది నా పరువుకు భంగం కలిగేలా ఉందని, ప్రాణహాని కలిగించే విధంగా ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. విజయచౌదరిపై తగు చర్యలు తీసుకోవాలని, తనకు న్యాయం చేయాలని భంజ్‌దేవ్ కోరారు.

భోగి పండగకు ఆ గ్రామాలు దూరం

సంక్రాంతి పండగ అనగానే తొలి రోజు భోగి పండగ జరుపుకోవడం తెలుగు లోగిళ్లలో సంప్రదాయం. కానీ పలు గ్రామాల్లో భోగి పండగను జరిపే అలవాటు లేదు. ఇది ఆయా గ్రామాల వారు తమ ఆచారంగా భావిస్తున్నారు. పూర్వీకుల నుంచి వస్తున్న ఈ ఆచారాన్ని నేటి తరం వారు కూడా పాటిస్తున్నారు.

- ఏళ్లుగా వస్తున్న ఆనవాయితీ



తెర్లాం: భోగి పండగను జరుపుకోని తమ్మయ్యవలస గ్రామం

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల ప్రజలు భోగి పండగను దశాబ్దాలుగా జరుపుకోవడంలేదు. భోగి పండగ రోజున ఏదో అరిష్టం జరిగిందన్న నెపంతో కొన్ని గ్రామాల్లో భోగి పండగను జరుపుకోవడం మానేయగా, మరికొన్ని గ్రామాల్లో మాత్రం భోగి పండగ సందర్భంగా భోగి మంటను వేసే అలవాటు తమ పూర్వీకుల నుంచి అలవాటు లేదని నేటికి జరుపుకోరు. మండలంలోని తమ్మయ్యవలస, కుమ్మరిపేట, పాములవలస, ఎస్.బూర్జవలస, వి.చిన్నయ్యపేట, ఆమిటి సీతారాంపురం, గొలుగువలస గ్రామాల్లోని ప్రజలు భోగి పండగను జరుపుకోరు.

దశాబ్దాలుగా భోగికి దూరం

వంగర: సంక్రాంతి వేడుకల్లో భాగంగా పండగ ముందురోజు భోగిని సందడిగా జరుపుకోవలసిన రోజు ఇది. 86 ఏళ్ల క్రితం ఆ గ్రామాల్లో సంభవించిన ఓ అపశ్రుతి.... ఫలితంగా ప్రజల్లో బలంగా నాటుకుపోయిన మూఢనమ్మకమే భోగి పండగకు దూరమయ్యేందుకు ప్రధాన కారణం . మండలంలోని కె.కొత్తవలస, ఎం.సీతారాంపురం గ్రామాల్లో భోగి వేడుకలు గత కొన్ని దశాబ్దాలుగా జరుపుకోవడం లేదు. సుమారు 86 ఏళ్ల క్రితం కె.కొత్తవలసలో భోగి పండగ రోజున మంటలు వేస్తుండగా పశువుల శాలలో ఉన్న రెండు ఎద్దులు భోగి మంటల్లో పడి మృతి చెందాయి. ఎం.సీతారాంపురం గ్రామంలో సరదాగా భోగి మంటలు వేస్తుండగా రెండు పిల్లులు మంటల్లో దూకి కాలి బూడిదయ్యాయి. దీంతో ఆ గ్రామాలకు దైవకంగా ఏదో కీడు జరగబోతుందేమోనని, గ్రామ ప్రజలకు ఏమైనా నష్టం కలుగుతుందేమోనని మూఢ విశ్వాసంతో అప్పటి నుంచి భోగి మంటలు వేయడం మానేశారు.

భోగీకి దూరంగా 'అలుగోలు'

నెల్లిమర్ల రూరల్: మండలంలోని అలుగోలు గ్రామం భోగి పండగకు దూరం. పూర్వ పెద్దలు నుంచి ఈ ఆచారం కొనసాగిస్తున్నామని గ్రామస్తులు చెబుతున్నారు. సుమారు 55 ఏళ్ల కిందట భోగి పర్వదినం రోజున జరిగిన అపచారం నేపథ్యంలో అప్పటి నుంచి భోగి మంట వేయడం లేదని, వేస్తే అరిష్టం జరుగుతుందని పెద్దలు ఈ నిర్ణయం తీసుకున్నారని స్థానికులు చెబుతున్నారు.



అలుగోలు గ్రామం

ఆ గ్రామాల్లో భోగి లేదు

రాజాం : మండలంలోని అంతకాపల్లి గ్రామంలో భోగి పండగ చేయరు. తమ తాతల కాలం నుంచి ఈ పండగను తమ గ్రామంలో జరుపుకోవడం లేదని, పక్క గ్రామాల్లో వేసే భోగి మంటలు వద్దకు గ్రామస్తులు వెళ్లి వచ్చేస్తుంటారని పంచాయతీ సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడు తెలిపారు. గ్రామంలో భోగి పండగరోజు గ్రామానికి చెందిన వాకముల్ల కుటుంబీకుల ఇంటి పండగ చేసుకుంటారు.

ఆ గ్రామాలు భోగి మంటలకు దూరం

బాడంగి: మండలంలోని ముగడ, భీమవరం, పిన్నవలస, పింద్రంగివలస గ్రామాల ప్రజలు భోగి మంటలకు దూరంగా గడుపుతారు. ఇందుకు ఒక్కో కథనం ఆయా గ్రామాల్లో ఉంది. అలా ఉన్న గ్రామాల్లో భీమవరం, బాడంగి ఉన్నాయి.

సంతకవిటి మండలంలో..

సంతకవిటి: మండల పరిధిలోని శ్రీహరినాయుడుపేట, కొండగూడేం, కాకరాపల్లి, గొల్లవలస, వాసుదేవపట్నం, పోతులజగ్గుపేట, రంగారాయపురం తదితర గ్రామాలు కొన్ని దశాబ్దాల నుంచి భోగి పండుగకు దూరంగా ఉంటున్నాయి. పిల్లి వంటి మూగజీవాలు భోగి మంటలో పడిపోయిన కారణంగా అపశకునంగా భావించి భోగి పండగను తమ గ్రామాలలో జరుపుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారు.